క్లుప్తంగా

గృహ ప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే



గృహ ప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు

కందుకూరు: మండల కేంద్రంలో గూడూరు మాజీ సర్పంచ్ దార జంగయ్య నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి ఆదివారం ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరై పూజల్లో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురసాని సురేందర్‌రెడ్డి, పి.శ్రీహరి, రామకృష్ణ, దీక్షిత్‌రెడ్డి, అలీ, బి.వెంకటేశ్, బలరామ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో బాచుపల్లి మాజీ సర్పంచ్ మృతి



సుదర్శనాచారి(ఫైల్)

కందుకూరు: మండలంలోని బాచుపల్లి గ్రామ మాజీ సర్పంచ్ సిరిగిరి సుదర్శనాచారి(65) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందాడు. ఆయన 2013–2018 సంవత్సరాల మధ్య ఆ గ్రామ సర్పంచ్‌గా సేవలందించారు. ఆదివారం హైదరాబాద్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, గ్రామస్తులు అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు.

సీపీఐ అభివృద్ధికి కృషి

జిల్లా సమితి సభ్యుడు శివ కుమార్ గౌడ్

తుర్కయంజాల్: సీపీఐ అభివృద్ధి కోసం కృషి చేస్తానని శివ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం శంషాబాద్‌లో నిర్వహించిన పార్టీ సమావేశంలో తనను జిల్లా సమితి సభ్యుడిగా ఎన్నుకున్నారని తెలిపారు. తను ఇప్పటివరకు ఏఐఎస్ఎఫ్ మండల, డివిజన్, జిల్లా అధ్యక్షుడిగా పనిచేశానని గుర్తుచేశారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని శివ కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం 4వ వార్డు పరిధిలోని శాంతినగర్‌లో నివాసముండే లెప్రసీ బాధితులకు చిల్డ్రన్ ఆఫ్ డెక్కన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక వార్డు కౌన్సిలర్ వద్దేపల్లి విద్యావతి విజయేందర్‌రెడ్డి హాజరై 100 మంది బాధిత కుటుంబాలకు సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ నాగళ్ల మల్కన్న, స్లాప్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. రమేష్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు సహకరించాలి

రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్

మాడ్గుల: భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వపరంగా సహకారం అందజేయాలని సీఐటీయూ అనుబంధ సంస్థ భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ పేర్కొన్నారు. మాడ్గుల మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ వెల్ఫేర్‌బోర్డుకు సంబంధించిన డబ్బులు పక్కదారి పట్టకుండా చూడాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్మికులకు కల్పించాల్సిన సదుపాయలు, అందించాల్సిన ప్రయోజనాలు గత ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో చొరవ తీసుకొని కార్మికులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ మండల అధ్యక్షుడు ముస్తఫా, ప్రధాన కార్యదర్శి నరసింహా, సీఐటీయూ కన్వీనర్ పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భోగ్ బండార్

తుర్కయంజాల్: మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో ఆదివారం సంత్ సేవాలాల్ మహరాజ్, మెరమ్మయాడి భోగ్ బండార్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేయించి తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ రమావత్ కలాణ్ నాయక్, కాంగ్రెస్ నాయకులు రాగ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయాలి

చేవెళ్ల: ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త పీఆర్సీని అమలు చేయాలని టీపీయూఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు గణపురం సురధీర్ డిమాండ్ చేశారు. చేవెళ్లలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉద్యోగులకు పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఉపాధ్యాయులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో హెల్త్ కార్డుల ద్వారా చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన 57మెమో ఆధారంగా 2003 డీఎస్సీ ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. మోడల్ స్కూల్‌లో సమస్యలను పరిష్కరించాలని, కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలన్నారు.



పాత కృష్ణవేణి స్కూల్ రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త



బడంగ్‌పేటనుంచి అల్మాస్‌గూడ వెళ్లే దారిలో కార్పొరేటర్ ఇంటిపక్కనే చెత్త

'చెత్తశుద్ధి' ఏదీ?

ఎక్కడపడితే అక్కడ పారబోత
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో జనం

బడంగ్‌పేట్: ఎక్కడ పడితే అక్కడ చెత్త దర్శనం ఇస్తుంది. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని శానిటేషన్ విభాగంలో అలసత్వంతో కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లు చెత్త డంపింగ్ యార్డులుగా మారుతున్నాయి. ఈ విషయంలో పట్టించుకునే వారు కరువయ్యారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లో 32 డివిజన్లు ఉన్నాయి. ఇక్కడ పారిశుద్ధ్యం లోపించిందని చెప్పొచ్చు. పరిసరాల అపరిశుభ్రత వల్ల ఇప్పటికే డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా లాంటి విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ఇప్పటికే పిల్లలు పెద్దలు అనే తారతమ్యం లేకుండా అందరినీ కబలిస్తుంది. ఈ సీజన్‌లో ఫాగింగ్ చేయాలని నిబంధనలు ఉన్నా ఫాగింగ్ మిషన్లు పనిచేయకుండా మొరాయించడం సర్వసాధారణంగా తయారైంది.

ప్రతీ నెల రూ.19 లక్షలు చెల్లింపు

బడంగ్‌పేట కార్పొరేషన్‌లో రోజువారిగా సేకరించిన చెత్తను ఉప్పల్‌లోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అందుకోసం ప్రతీ నెల రూ.19లక్షలు కార్పొరేషన్ నుంచి చెల్లిస్తున్నామని శానిటేషన్ అధికారులు చెబుతున్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని ప్రతీ కాలనీకి నిత్యం చెత్త సేకరణ వాహనాలను, ట్రాక్టర్లను పంపిస్తున్నామని చెబుతున్నారు. అయినప్పటికీ చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారేస్తున్నారని అధికారులు చెబుతున్నారు. చెత్త సేకరణ వాహనంలో వేయకుండా ఇలా రోడ్లమీద వేయొద్దని ఎన్ని మార్లు కాలనీల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసినప్పటికీ ఫలితం లేదని అధికారులు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం–పచ్ఛదనం కార్యక్రమాల్లో భాగంగా చెత్త వేస్తున్న ప్రాంతాలను గుర్తించి శానిటేషన్ అధికారులు శుభ్రం చేస్తున్నారు. బాధ్యతలు మరిచిన ప్రజానీకం నిర్లక్షంగా తెల్లవారేసరికి శుభ్రం చేసిన ప్రాంతాల్లో తిరిగి చెత్త డంపింగ్‌లుగా మారుస్తుండటం బాధ్యతారాహిత్యానికి పరాకష్ట.

బాధ్యతారాహిత్యం..

'మన ఆరోగ్యం.. మన చేతుల్లోనే' ఉన్నాయని ప్రభుత్వాలు, పాలకులు ఎంత మొత్తుకున్నా ప్రజలు మాత్రం బాధ్యతలు మరిచి కవర్లల్లో మూటలు కట్టి ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేస్తూ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారని ఎస్‌జీవోస్ వాలంటీర్లు చెబుతున్నారు. ఎక్కడ పడితే అక్కడ నిర్లక్షంగా వ్యర్థాలను పారవేసి బాధ్యతలను చేతులు దులుపుకుంటుండటం బాధాకరం. ఇంటి ముందుకు వచ్చే చెత్త సేకరణ వాహనాలలో వేస్తే సమస్య ఉండదు. డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా లాంటి విష జ్వరాలు ప్రబలవు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామనే విషయాన్ని నేటి ప్రజలు మరిచిపోతున్నారు. కాలనీల్లో 90 శాతానికి పైగా అంతా చదువుకున్నవారే ఉంటున్నారు. కాని పారిశుద్ధ్యం విషయంలో కొంచెం అక్షరాస్యులు ఆలోచిస్తే బాగుంటుందని అందరి భావన.

సిబ్బందిని పెంచాలి



పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా కాలనీలు విస్తరిస్తున్నాయి. చెత్త సమస్య కూడా పెరుగుతుంది. పారిశుద్ధ్యం లోపించడంతో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. చెత్తను నిర్లక్ష్యంగా పారవేస్తున్న వారిని గుర్తించి పెనాల్టీ వేయాలి. అవసరమైతే సిబ్బందిని పెంచాలి. అధికారులు ఎప్పటికప్పుడు చెత్త వేస్తున్న ప్రాంతాలను శుభ్రం చేయించాలి. దోమలు పెరగకుండా అన్ని డివిజన్లో ఫాగింగ్ చేయాలి.

– రామకృష్ణారెడ్డి, బడంగ్‌పేట్

బాధిత కుటుంబానికి పరామర్శ



రాములుగౌడ్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన గౌడ సంఘం పట్టణ అధ్యక్షుడు కందికంటి సుధాకర్‌గౌడ్ తండ్రి రాములుగౌడ్ ఆదివారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, రైతు బంధు జిల్లా సభ్యుడు బాచిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ లాయక్‌అలీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, రేవంత్‌మిత్ర మండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్‌అలీ తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా సుధాకర్‌గౌడ్‌ను ఓదార్చారు.

ఆర్థిక సాయం

మండల పరిధిలోని ఎక్వాయిపల్లి గ్రామానికి చెందిన పెంటమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ ఉమావతి బుగ్గయ్యగౌడ్ బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి ఆర్థిక సాయంతో పాటు, బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్, మల్లేశ్, ప్రకాశ్, శ్రీశైలం, మహేశ్ తదితరులు ఉన్నారు.

మంద కృష్ణమాదిగకు స్వాగతం పలకాలి



అభివాదం చేస్తున్న నేతలు

ఇబ్రహీంపట్నం: ఎస్సీ వర్గీకరణ పోరాటంలో విజయం సాధించినందుకు డిల్లీ నుంచి హైదరాబాద్ నగరానికి మంగళవారం విచ్చేయనున్న మంద కృష్ణ మాదిగకు ఘనస్వాగతం పలకాలని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ మాదిగ, ఉపకులాల నేతలు, ప్రజాప్రతినిధులు, ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నేతలు పిలుపునిచ్చారు. ఆయా కులస్తుల నియోజకవర్గ సమావేశం ఆదివారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అలుపెరుగకుండా 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం చేసి సుప్రీంకోర్టులో చారిత్రాత్మకమైన విజయాన్ని సాధించిన అనంతరం నగరానికి విచ్చేస్తున్న మంద కృష్ణ మాదిగకు ఉద్యోగులు, యువత, విద్యార్థులు, మహిళలంతా ఐకమత్యంతో ఘనస్వాగతం పలుకలన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు కొండ్రు ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ కృపేశ్, బీజేపీ నాయకుడు బోసుపల్లి ప్రతాప్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, మాజీ సర్పంచ్ బండిమీద కృష్ణ, బోసుపల్లి వీరేశ్‌కుమార్, రావుగళ్ల బాబు, కాళ్ల జంగయ్య, పి. నరసింహ, ఆర్ రమేష్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

చికెన్ సెంటర్లకు నోటీసులు

సాక్షి ఎఫెక్ట్..

యాచారం: యాచారం గ్రామంలోని ఎల్లమ్మగుడి కాలనీలో శనివారం పిచ్చి కుక్క దాడిలో ఐదుగురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. వీధి కుక్కలు కరిచేస్తున్నాయి.. అనే కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ఎంపీడీఓ నరేందర్ రెడ్డికి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చికెన్ సెంటర్ల నిర్వాహకులు కోళ్ల వ్యర్థాలను రోడ్లపై ఇష్టానుసారంగా పడేస్తున్నారు. దీంతో వాటి వ్యర్థాలను తింటున్న కుక్కలు రక్తం, మాంసానికి అలవాటుపడి మనుషులు, జంతువులపై దాడులు చేస్తున్నాయి. ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం యాచారం గ్రామ పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య గ్రామంలోని చికెన్ సెంటర్లను సందర్శించి నిబంధనలు పాటించని నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. కోళ్ల మాంస వ్యర్థాలను ఇష్టానుసారంగా పడేయొద్దని హెచ్చరికలు జారీ చేశారు.



చికెన్ సెంటర్ యజమానికి నోటీసు ఇస్తున్న పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య

అందని అంగన్‌వాడీ సేవలు

- గర్భిణులకు తప్పని ఇబ్బందులు
- పౌష్టికాహారం అందక ఆందోళనలో బాలింతలు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జిన్నాయిగూడ ఒకప్పటి రావిర్యాల గ్రామ పంచాయతీ ఆవాస గ్రామం. ఈ గ్రామంలో సుమారు 30 కుటుంబాలు నివాసం ఉంటున్నారు. ఈ గ్రామంలో మౌలిక వసతులు నిల్. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రం లేదు. దీంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాలంటే రెండు కిలోమీటర్ల దూరం రావిర్యాలకు నడవాల్సిందే. అంగన్‌వాడీ కేంద్రంలో అందజేసే వ్యాక్సిన్స్, పౌష్టికాహారం కోసం నడిచిరావడానికి మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నేళ్ల నుంచి ఇక్కడ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేస్తున్నారు. అయినా ఎవరూ తమ గోడును పట్టించుకోవడం లేదనే ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా తాము పడుతున్న ఇబ్బందులు గురించి ఆలోచన చేసి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని సీడీపీఓను కోరుతున్న జిన్నాయిగూడ మహిళలు (ఫైల్)

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

మున్సిపాలిటీ పరిధిలోని జిన్నాయిగూడలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు గురించి స్థానిక మహిళలు మా దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అంగన్‌వాడీ ఏర్పాటుకు కృషి చేస్తా.

– శాంతిశ్రీ, సీడీపీఓ, మహేశ్వరం

భక్తి శ్రద్ధలతో సీత్ల పండుగ

యాచారం: మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లి గ్రామంలో ఆదివారం సీత్ల పండుగను గిరిజనులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి యేటా శ్రావణ మాసంలో ఈ పండుగను నిర్వహించడం అనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఆదివారం గ్రామస్తులు తమకున్న పాడి, పశువులు, గొర్రెలు, మేకలను గ్రామంలోని ఇళ్ల నుంచి తీసుకెళ్లి గ్రామ చివర దేవతామూర్తుల విగ్రహాల వద్ద పూజలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో మంతన్‌గౌరెల్లి మాజీ ఎంపీటీసీ సభ్యులు కొర్ర జ్యోతి, అరవింద్‌నాయక్, గ్రామస్తులు యాదయ్య, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న గిరిజన పెద్దలు



అమ్మవారి ఘటాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు

ఘనంగా బోనాల ఉత్సవాలు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలో ఆదివారం బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అంబేడ్కర్‌నగర్‌లో జరిగిన వేడుకలో టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బైగళ్ల బాలమణి, నాయకులు చల్లా బాల్‌రెడ్డి, ఓంప్రకాశ్ పాల్గొన్నారు.



ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

షాబాద్: మండల పరిధిలోని తాళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల 2003–2004 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం చేవెళ్ల మండల పరిధిలోని అల్లవాడ రాజ్యలక్ష్మి గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇరవై ఏళ్ల తర్వాత అందరూ ఒకచోట కలిసి ఒకరినొకరూ ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు చేర్పిన ఉపాధ్యాయులను వేదికపై పిలిచి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంరెడ్డి, బద్రన్న, ఆయూబ్‌ఖాన్, రాంచందర్, సునీత, శిరీశ్, విద్యార్థులు వడ్ల సుమన్‌చారి, గోవుల అంజయ్య, శశికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

ఎంపీడీఓ శ్రీకాంత్

తలకొండపల్లి: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో వీధి కుక్కల నియంత్రణకు తగు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ శ్రీకాంత్ పేర్కొన్నా రు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని 32 గ్రామ పంచాయతీలో సర్వే నిర్వహించి 1,326 కుక్కలు ఉన్నట్లుగా గుర్తించామని తెలిపారు. కుక్కల బారిన పడకుండా తగు రక్షణా చర్యలు తీసుకోవాలని గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కుక్కల సంఖ్య పెరగకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. మృతి చెందిన కోళ్లను పాతిపెట్టాలని, కోళ్ల, మటన్ వ్యర్థాలను రోడ్డుపైన పడవేయకుండా జాగ్రత్తగా గుంత తీసి పాతి పెట్టాలని షాపు నిర్వాహకులకు తెలిపినట్లు చెప్పారు. మండలంలోని పశు వైద్య కేంద్రాల్లో పెంపుడు కుక్కలకు యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్‌లు వేస్తున్నట్లు డాక్టర్ శంకర్ తెలిపారు.

అభివృద్ధికి ప్రాధాన్యం



బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమం కోసం కలిసి రావాలని ఆయన కోరారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం విద్యానగర్ కాలనీ సంక్షేమసంఘం అధ్యక్షుడు పాషా, కాలనీవాసులు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డిని వారు సత్కరించారు. అనంతరం విద్యానగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. విద్యానగర్ కాలనీలో కరెంట్‌లో ఓల్టేజీ ఉన్నందునా అదనంగా రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, కృష్ణతాగునీటి పైప్‌లైన్ పనులను సత్వరమే పూర్తిచేయించాలన్నారు. కాలనీలో సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాలువలు నిర్మించాలని, కాలనీకి కమ్యునిటీహాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికోసం అధికారులతో కలిసి ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు ఆయన వివరించారు. ఆమనగల్లు పట్టణంలో ఎన్నో ఏళ్లుగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆమనగల్లు అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా అందరు కలిసివస్తే ఆమనగల్లును ఆదర్శంగా తీర్చిదిద్దొచ్చని ఆయన చెప్పారు. త్వరలో జూనియర్ కళాశాల భవనం పూర్తిచేసి విద్యార్థుల ఇబ్బందులు తీరుస్తామని ఆయన పేర్కొన్నారు. డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల భవనాలు నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యానగర్ కాలనీ సంక్షేమసంఘం ఉపాధ్యక్షుడు వర్కాల శేఖర్, కోశాధికారి సుదర్శన్‌రెడ్డి, సభ్యులు పర్వతాలు, నాయకులు మెకానిక్ బాబా, తల్లోజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నారాయణరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న విద్యానగర్ కాలనీసంఘం అధ్యక్షుడు పాషా

బాధితుడికి పరామర్శ..

మాడ్గుల: అప్పారెడ్డి గ్రామపంచాయతీకి చెందిన మహేందర్ ఇటీవల అగ్నిప్రమాదంలో గాయాలవ్వడంతో కామినేని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మహేందర్‌ను పరామర్శించారు. తక్షణ సాయం కింద రూ. 5వేలు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి రూ. 5వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సింహ్మాగౌడ్ పాల్గొన్నారు.